# చేమంతిపూవు స్నేహం

[ చిన్న కథ ]

" నేను కూడా సాక్షినే అంటూ తారా
జారుడు జోరుగా ప్రకాశింప సాగాడు. "

రచయిత :

కొత్తపల్లి శ్రీరామమూర్తి, యల్.యం.ఇ.

౧

ప్రకాశరావుగారు పేరుప్రఖ్యాతులున్న న్యాయవాది. ప్రస్తుతంలో మదరాసు హైకోర్టులో ప్రాక్టీసు చేస్తున్నారు. ధనము వేకాక తమ వృత్తిలో యశోధనమును కూడా సముపార్జిస్తూనే వున్నారు.

సరోజ వారి ఏకైకపుత్రిక. ఆమె అందచందములు చూపరులకు వెరగు పుట్టిస్తాయి. అంటే ముగ్ధమోహనాకారం అని చెప్పాలి. ఆమెభావాలు నవీనములైనా వేషంమాత్రం పురాతనముగానే వున్నది.

ఆమె బి. ఏ. క్లాసు చదవటానికి ప్రెసిడెన్సీ కాలేజీలో చేరింది. ఆమె, నేనూ ఒకేక్లాసులో చదువుకోవడం తటస్థించింది.

సరోజను ప్రథమదివసము చూడటంతోటే నామన మామెపై లగ్నమైనది. నేను ఆమెను ఎంతగాఢంగా ప్రేమిస్తూ వున్నానో ఒక్క భగవంతునికే ఎరుక.

ఆమె నామనోవైకల్యం కనిపెట్టిందో ఏమో! నాకేసి వారచూపులు ప్రసరించేది సమయం చిక్కినప్పుడల్లా. నేను ఆమెనంక బేలగా చూచేవాణ్ణి.

ఒకసారి కర్మవశాత్తు కాలేజీలో ఒక ఉపన్యాసం జరుగుతోంది. విద్యార్థులు, విద్యార్థినిలు దానికి అందరూ హాజరుకావలెనని నోటీసువచ్చింది. ఆ తరుణములో ప్రయత్నపూర్వకంగా సరోజ కూర్చున్న వెనక బెంచిమీదకు చేరాను. శ్రీనివాసశాస్త్రి ప్రస్తుత రాజకీయ పరిస్థితులను గూర్చి తీవ్రముగా ఉపన్యసిస్తున్నాడు. కాని నాదృష్టిఅంతా సరోజమీదనే లగ్నమైవుంది. సరోజ ఉపన్యాసంలో లీనమై వెనక్కి జారబడికూర్చుంది బొమ్మలా. ఆసమయం పోనీయకూడదని బల్లక్రిందనుంచి చేయిపెట్టి ఆమె జడమీద మెరుస్తూయున్న బంగారపు చామంతిపూవు సంగ్రహించాను. దొంగతనంచేయాలని కాదు-

నా ఎత్తుపారింది. ఉపన్యాసం పూర్తి అయింది. జనంఅంతా ఒడ్డుపగిలిన చెరువులా గలగలా బయటపడ్డారు. నేను మాత్రం సరోజను కొంతదూరంలో అనుసరించాను. ఆమె బీచివైపు పోతోంది. అయిదునిముషాలు గడిచేసరికి 'లవర్సు పాత్తులో' ఆమె, నేను తప్ప ఎవరు సమీపంలో లేరు. పలుకరించాలని ఉబలాటం కలిగింది. ‘సరోజా!’ అని పిలిచాను. ఆమె వెనక్కితిరిగి ‘మీరా!’ అంటూ ఒక్క చిరునవ్వు నవ్వింది.

‘మీజడలోని బంగారపు చామంతి పువ్వు పోయిందా?’ అని ప్రశ్నించాను. ‘లేదంటూ’...తలమీద చేయి వేసుకొని తడుముకుంది. ఏదో చెప్పబోతుండగా నే ‘నాకొకటి దొరికిం’దన్నాను.

‘అది ఎవరిదో చెపుతా, చూపించండంది.’—సరోజ. ఆమె పెదమెలమీద మందహాసం నృత్యం చేస్తోంది.

‘తప్పకండా చూపుతాను.’ అంటూ నాచేయి చాపాను.

ఆమెకు ఆశ్చర్యంవేసింది. ‘మీకు ఎక్కడ దొరికింది?’ అంది మృదువుగా.

కొంటెతనంగా నవ్వుతూ ‘మీ[illegible]?’ అన్నాను.

‘నాది కనుక నే అడుగుతున్నా. ఎక్కడ...’ అని ఏదో అనబోయి నాలుకకర్చుకుంది.

‘ఈ వేళ కాలేజీ లెక్చరుహాలులో దొరికింది. మీ జడమీద దీనిని చాలాసార్లు చూచినట్లు జ్ఞాపకం. అందుచేత మిమ్ములను ముందు అడుగుదామని వచ్చా’నంటూ దానిని ఆమెను తీసుకోమన్నాను. ఆమె కరపల్లవంచాపి తీసుకొంటూ వుంటే ఆమె చెయ్యిపట్టుకుని ప్రేమపూరితంగా ఆమె నేత్రాలలోకి చూశాను. ఆమె చెయ్యి విదలించుకొని నవ్వుతూ

'గుడ్ ఆఫ్టర్‌నూన్' అంటూ గబగబా ఫుట్‌పాత్ మీదకి పోయింది.

## ౨

కాలం గడిచిపోతోంది. ఆకురాలు ఋతువుపోయింది. ప్రకృతికాంత నూతన వస్త్రధారణము చేయుచున్నదా అన్నట్టు వృక్షజాలములు లేతచిగుళ్ళతో నూతన శోభనుపొందుచున్నవి. నేను ఆశనిరాశల మధ్యను వూగులాడుతూవున్నాను. కాని ఆమె, నేను తారసపడినప్పుడల్లా ఒకరికొకరం అభివందనాలు అర్పించుకునే వాళ్ళం.

ఒకానొక శుభదినం. ఆవేళ శుక్రవారం. నేను మామూలుగా నాగదిలో కూచుని చదువుకుంటున్నాను. మాయింట్లో దాసి వెంకమ్మ గబగబా నాగదిలోకి వచ్చింది. దానితోకూడా ఒక నూతనపురుషుడు వచ్చాడు. అతనివేషం చూస్తే 'చోప్రా' లా వున్నాడు. వాడి పేరు మారుతి అని తెలుసుకున్నాను. 'ఏంపనిమీద వచ్చావు' అని ప్రశ్నించాను ఆనాఖరును.

నా ప్రశ్నకు జవాబుయియ్యకుండానే, అతివినయవిధేయతతో అతడు నాబల్లమీద ఒక వుత్తరం పెట్టినాడు.

ఆ వుత్తరం సరోజా వ్రాసింది. దానిని చూస్తూంటే నేను ఎక్కడో నూతన జగత్తులో వున్నట్టు అనిపించింది. కాని ఆ వుత్తరంలో తనకేమైనా మంచి పుస్తకం ఒకటి చదువుకోడానికి యిమ్మనీ, ఆదివారం సాయంకాలం 5 గంటలకు అడయారు మఱ్ఱిచెట్టుక్రింద తన్ను కలుసుకోమని వ్రాసింది.

ఆమె చదువుకోడానికి ఏంపుస్తకం యీయాలో నాకు ఏమీ తోచిందికాదు. చట్టాలున లేచి నాబీరువాఅంతా వెతికి నాబొమ్మతో సహా నావ్యాసము ముద్రించిన ఆంధ్రభూమి సంచికగల సంపుటాన్ని ఒక దానిని యిచ్చిపంపాను. ఆపుస్తకంతోపాటు ఒక జాబుకూడా పంపాను. అందులో 'సరోజా! నీతో పరిచయభాగ్యము కలిగినందుకు చాలా ఆనందంగా వుందని' వ్రాశాను.

ఆరోజున క్లాసులో ఆమెవైపు చూడటం, ప్రక్కన కూచోడం మా నేశాప్రజలు అపోహపడతారనే భీతి నాహృదయంలో బితుకుబితుకుమంటూ వుంది, కనుక.

గంట ఒకయుగంగా శనివారం గడిపేశాను.

## 3

ఆదివారం ఉదయమే నామోటారు సైకిలిని శుభ్రంగా తుడిచిపెట్టమని మా వెంకన్నతో చెప్పాను.

ఎప్పుడు అయిదుగంటలవుతుందా అనే నాఆదుర్దా. నాలుగు గంటలకే తయారైపోయాను. యీవెనింగ్ యిన్ ప్యారిస్ అను క్రీమురాసి తల చక్కగా దువ్వుకున్నాను, శాలంపంచ, మల్లు చొక్కా, ట్వీడ్ కోటు వేసుకుని జమ్మని తయారైనా కొత్తపెళ్ళికొడుకులాగున.

మాబసకు అడయారు మఱ్ఱిచెట్టుకి సుమారు రెండుమైళ్లు వుంటుంది. మోటారు సైకిలుమీద వెళ్ళడం అంటే అయిదు నిముషాలకన్న ఎక్కువకాలం పట్టదు. కాగా కాలుకాలినపిల్లిలాగున తిరుగుతూ ఎప్పుడు అయిదునిముషాలు తక్కువ అయిదు అవుతుందా అని నా చేతిగడియారంకేసి వూరికే చూస్తూవుండేవాణ్ణి, ఎట్లాగో ఓపికపట్టి. అయిదు నిముషాలు తక్కువ అయిదింటికి బయలుదేరి యిండియన్‌లు ఉద్యోగాలలోను, ఉపన్యాసాలలోను కూడా చూపకుండే పంక్చ్యుయాలిటీ నేను కీప్‌చేసాను.

అడయారునది వడ్డున విరాజిల్లే ఆ తోట దానిలోని భవనముల శోభ నేను చెప్ప నక్కరలేదు. ఆమఱ్ఱివృక్షము అద్వితీయమంటే సరిపోతుంది.

మెల్లిగా ఆ వటవృక్షం సాయలకు చేరితిని కాని నా కంటికి నాప్రేమమూర్తి కనుపించలేదు. కొంచెం కలవరపడ్డాను. ఆచెట్టువద్ద యిక ఎవరూ కూడా లేరు ఆసమయంలో. పోని పొరపాటున లైబ్రరీలోకాని వుందేమో అని చూచాను. అక్కడా కనుపించలేదు. నిరుత్సాహపడ్డాను. తిరిగివచ్చా. ఇంతలో మీదనుంచి ఏదోపడింది క్రింద దభీమని. పామేమోనని త్రుళ్ళిపడి లేచి పరుగెట్టబోయా. తీరా మాస్తే అది తొండ.

ఇంతలో ఒక మూలనుంచి కోకిలల ధ్వని వినవచ్చింది 'ఎంతసేపైంది నీవు వచ్చి రఘురామ్!' అంటూ. వెనక్కి తిరిగి చూచాను. నాప్రేమనిధానము సరోజ నాకు ప్రత్యక్షమైంది.

## ౪

'ఇదిఏమీ బాగులేదు సరోజా! ఇంతసేపు ఏంచేస్తున్నావు' అన్నా జాలిగా.

'ఏమీచేయడంలేదు రఘూ!' ఈవాళ వచ్చిన ఆంధ్రభూమి సంచికలో నీవు వ్రాసిన కథ చదువుతూ వుండిపోయా. ఇప్పుడే వచ్చాను.'

'అవును' అన్నా గంభీరంగా.

'అయితే రా, పోదాం, రా' అంటూ తాను ముందు నడుస్తూ దారి చూపింప సాగింది నాకు తెలియనట్టు.

మెల్లగా ఆమెచేయిపట్టుకుని ఆమెతోకూడా నడవసాగాను. ఎందుకని కాని

ఎక్కడకని కాని అడగకుండా. ఆమె ముసిముసి నవ్వు నవ్వింది. నేను కొంచెం మందహాసం ప్రకటించాను.

'అయితే నన్ను ఎక్కడకి తీసుకెడదామని నీయూహ' అన్నా పట్టజాలక.

'అబ్బే ఎక్కడికీ లేదు. వూరికే ఆసముద్రతీరాన్ని నడుద్దామని' అంది.

'నీయిష్ట'మని వూరుకున్నా. చెప్పడం మరిచాను. ఆరోజున పౌర్ణమి. మేము సరదాగా ఆ నీటివొడ్డున అతరంగముల చెలగాటం చూస్తూ కాస్సేపు అటునిటు తిరిగి మెల్లగా ఇసుకలో చతికలబడ్డాం. ఆమె తనచేతిలోవున్న పుస్తకసంపుటం తీసి నా ఫొటో చూడడం మొదలుపెట్టింది తదేక దీక్షతో.

నేను అప్పుడే వుదయించుచున్న చంద్రబింబమును, ఆమె ముఖపద్మమును చూస్తూవున్నా, ఇందులో ఏది కళావంతమైనది అని. చంద్రునిలో మచ్చ అందవికారంగా కనిపించింది. కాని ఆమె విశాలమైన నేత్రాలు మిలమిల మెరుస్తూ ముఖమునకు మరింత శోభనిస్తూవున్నవి. ఆవుంగరాలజుట్టు పిల్లతెమ్మరలకు అల్లల్లాడుతూవుంటే తుమ్మెదలు పద్మముపై వ్రాలుచున్నవా అన్నట్లు తోచిస్తోంది. నేను ఇలా ఆముగ్ధమోహనరూపం చూసి మురిసిపోతుంటే ఆమె లేతవెన్నెలవెలుగులో నా ఫొటోనే చూస్తోంది.

※

నేనిక వూరుకోలేక 'సరోజా! ఏమిటి నీవుచూస్తున్న' దన్నా.

'నీవు కథలు బాగా రాస్తావోయి.' అని అంది నాప్రశ్న వినుపించుకోని దానిలాగున. అయితే నీవు ఇప్పుడు చదువుతున్నట్టు లేదే అన్నా.

'కాదు. ఇప్పుడుగాదు నిన్న చదివాను' అంది.

'ఇప్పుడు చదవటంలేదుకదా! సరోజా! నిన్నొక ప్రశ్న అడగాలని వుంది. అది నీకు బాగా తెలిసివుంటుందని నా అభిప్రాయం' అన్నాను.

'ఏమిటా ప్రశ్న రఘూ!'

'సరోజా! స్త్రీలు స్వభావసిద్ధంగా సిగ్గరులట. మొగాడికీ సిగ్గంటే ఏమిటో తెలియదు? అవునా?' అన్నాను.

'దానికి నేను సరిఅయిన సమాధానం యియ్యలేనేమో,' అంది కనుబొమలు ముడివేస్తూ.

'అయితే ప్రేమికులమధ్య సిగ్గు వుండదనుకుంటా. తాము ప్రేమించిన వారిని చూచుటకు సిగ్గుపడరు కాని యువకులు ఒడియపడతారు. అవునా, సరోజా! యువతులు సిగ్గుపడతారు. నయూనాకి ఒక పిల్ల తాను ప్రేమించినవాని ప్రతిబింబము చూస్తూవుందనుకో, ఆమె చూడనట్టు నటిస్తుంది...' అని ఏదో చెప్పబోయాను.

'ఏంకుళ్లుమాట్లంటావోయి, రఘూ!' అని కళ్లు ఎర్రజేసింది. ఆచూపుల్లు వాడితూపుల్లా వున్నాయి.

కొంతసేపు ఏదో ఆలోచిస్తున్నట్లు కనుపించింది ఆమె వాలకం. నేను ఆమెవంకే చూస్తున్నా. నాచూపులు ఆమెను కదలించాయి. ఆమె అధరపల్లవంమీద హాసము తొణికిసలాడింది. వచ్చేనవ్వును ఆపుకోలేక ముఖం ప్రక్కకు త్రిప్పివేసింది.

'ఎందుకు నవ్వుతావు సరోజా!' అన్నాను ఆతురతతో.

'ఏమనుకున్నావు?' అని నాకేసి ఎగా


# టి. సి. యెన్. గోల్డన్ నగలే




స్త్రీల కన్నివిధాల అలంకారానికి తగినవి.
2 సంవత్సరములు గ్యారంటీ. కాంతిలోను, వన్నెలోను, బంగారు గాజుల కేమాత్రము తీసిపోవు. వలు పెక్కువు.

| | | | |
|---|---|---|---|
| పెద్దసైజు గాజులు 2 ఇంచి మొదలు పైబడినవి | జత 1-కి రూ | | 3-0-0 |
| మధ్యమసైజు $1\frac{3}{4}$ ఇంచి మొదలు 2 ఇంచిలకులోగా | ,, | ,, | 2-8-0 |
| బేబీసైజు $1\frac{3}{4}$ ఇంచికి లోబడినది | ,, | ,, | 2-0-0 |
| వి.పి. ఖర్చు 1 జత మొదలు 6 జతలువరకు | ,, | | 0-8-0 |

మా చక్కని బొమ్మల క్యాటలాగు ఉచితము.

N.B:-మీరు వ్రాయు ఆర్డరు జాబులయందు 'ఆంధ్రభూమి' పేరు నుదహరించిన నాధరలమీద రూపాయకు ఒక అణా వంతున తగ్గించబడును.

## టి. సి. నాగలింగప్ప & కో.,

నెం. 280, వాల్టాక్సరోడ్, పార్కుటవున్ పోస్టు, మదరాసు.

దిగా చూచింది. అప్పటి ఆమె చూపు ఏదో ప్రశ్నించుచున్నట్టుంది.

'ఏమిటూ కులుకని'

'అవును, నేను కులుకుచున్నాను. రఘూ !' అంది మృదువుగా.

'ఎందుకో తెలుసుకోవచ్చునా?' అన్నా.

'నీవు నాకు సహాయం చేయగలిగితే ...' అని ఏదో చెప్పబోయింది.

'ఏవిధంగా' అన్నాను.

'నాకోసం ఒక చక్కని హాస్యపూరితమైన కథవ్రాసి పెడుదువు' అంది.

'ఎందుకు? ఏపత్రికలోనైనా వేయించుకుంటావా?' అన్నాను.

'అవును మనకాలేజీ మేగజైన్‌లో వేయిస్తాను.' అంది.

'అయితే తప్పకుండా వ్రాస్తాను.'

'అయితే నీవు ఏపత్రికలలో తరచు వ్యాసాలు వ్రాస్తూవుంటావు?' అంది.

'ఒకటేమిటి అన్ని తెలుగుపత్రికలలోను నాకథలు పడుతూవుంటాయి తరచు' అన్నా గర్వంగా.

'దయయుంచి నాకోరకు నవ్వు పుట్టించేకథ ఒకటి వ్రాసిపెడుదువు. ఏం'. అంది అతి చనువుగా.

'అయితే కాలేజీవిద్యార్థి జీవితాన్ని గురించి వ్రాయమంటావా?' అన్నా.

'ఓ ఏదైతేనేమి నీరచనాచాతుర్యంలోవుంది మజా. కడుపుబ్బేటట్టు నవ్వుపుట్టించేదిగా వుండాలి. అంతే ?'

'నాకు తెలుసు ఆవిషయం.'

'అయితే, ఇంకేం, నీవు నాప్రియుడవే. నేను నిన్ను ప్రేమిస్తున్నాను, రఘూ! నీవంటే ఎంతో, ఇష్టం' అంది.

ఆమె అమాయకంగా నోరుజారింది. ఈ అవకాశం పోగొట్టుకోకూడదనుకున్నా. ప్రేమసోపానమునకు ఈడ్చుకుపోవాలనుకున్నా.

'సరోజా! నీమాటలు సత్యదూరం కావు. ప్రేమకు, హితవుకి ఏమీ భేదం లేదు. ఎక్కడ హితవులేదో అక్కడ ప్రేమవుండనేరదు. అవునా?' అన్నాను.

'నిశ్చయంగా' అంది ఆమె.

'అయితే నాయందు నీకు పరిపూర్ణమైనప్రేమవుందని తేలింది యిప్పుడు...'

ఆమె ఏమీ మాటాడలేదు. కాని ప్రత్యుత్తరంగా మందహాసము ఆమెవదనంలో తాండవించింది. ఆమె విశాలమైన నేత్రములలో ప్రేమజ్యోతి వెలుగొందుచున్నది.

'ప్రియూ. ! హృదయపూర్వకంగా నన్ను ప్రేమిస్తున్నావా?' అన్నది బేలగా.

'లేకపోతే ఇక్కడకు వచ్చివుండేవాణ్ణి కాదు, సరోజా!' అన్నా.

'ప్రియసఖా ! రఘూ ! నిన్నెంతో పూజిస్తున్నాను, నాహృదయమందిరమున' అంది. ఆమాటలాడుచున్నంతసేపు ఆమెలో ఏదో నూతనవికాశం కనుపించింది.

'అయితే నన్ను పెళ్ళిచేసుకుంటావా? సరోజా!' అని ఆమె మృదువైన చేతులు నాచేతులలోనికి తీసుకున్నాను.

'తప్పకుండా' అంది.

'ఎప్పుడు?' అన్నా ఆతురతతో.

'నీచదువు పూర్తిఅయినతరువాత' అంటూ యిసుకలో కాలితో ఏదో వ్రాయసాగింది.

'నిశ్చయంగా?'అన్నాను.

'ఇంకను అనుమానమా? రఘూ!'అంది.

'అయితే మన ప్రేమబంధమునకు సాక్షిగా ఒకముద్దు యివ్వు'ని దగ్గరకు లాక్కున్నా. ఆమె రెండుచేతులు వృక్షమును పెనవేసుకొన్న లతవలె నాకంఠమును మెలివేసుకుపోయాయి.

ఆముద్దు గాఢాలింగనంలో ఇమిడి పోయింది.

ఆముద్దే కాదు. మేమిద్దరమూ- రఘూ సరోజలము- ఏకమయినాము.

ఇందుకు తాము సాక్షులమంటూ పక్షులు మధురుతం చేయుచు పరుగెత్త సాగినవి. నేనుకూడా సాక్షినే అంటూ తారాజారుడు జోరుగా ప్రకాశింపసాగాడు.


ప్రజారోగ్య చట్టం

మద్రాసు అసెంబ్లీలో

ఆమోదాన్ని బడసింది.

అనారోగ్యంతో

—తీసుకోనేవారు—

అంటు రోగాలతో

—కుమిలేవారూ—

వెంటనే మేల్కొకపోతే

అనేక ఇక్కట్టులకు

అడ్డంకులకు

—లోనుకాబోతారు—

కాబట్టి—తక్షణం—మీామీా

అనారోగ్యసందర్భాలలో

అశ్విన్‌కుమార్ ఫార్మసీ

నర్సాపురం

వారితో సంప్రతింపు చేయండి